## క్లుప్తంగా

### అభ్యంతరాల స్వీకరణ

మొగుళ్లపల్లి: మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను జీపీ కార్యాలయాల్లో పెట్టడం జరిగిందని ఎంపీడీఓ మహబూబ్‌హుస్సేన్ తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 21 వరకు ఆయా పంచాయతీ కార్యదర్శులకు లిఖితపూర్వకంగా తెలపాలని కోరారు.

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

రేగొండ: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు ఎస్సై సందీప్‌కుమార్ శనివారం అందజేశారు. మండలంలోని భాగిర్థిపేటకు చెందిన జూపాక అవినాష్, కొత్తపల్లిగోరి మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తిరుపతి సెల్‌ఫోన్లను ఎక్కడో పోగొట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వివరాలు నమోదు చేసి ఫోన్లని గుర్తించి బాధితులకు అందజేశారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న, దొంగతనానికి గురైనా ఫోన్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, ఈ పోర్టల్ ద్వారా ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉందని ఎస్సై సూచించారు.

### ప్రత్యేక పూజల్లో ప్రజాప్రతినిధులు



టేకుమట్ల: గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సంగి రవి ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

### జియో సేవలకు అంతరాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో జియో సెల్‌ఫోన్ సేవలకు అంతరాయం కలిగింది. శనివారం సాయంత్రం నుంచి సిగ్నల్స్ లేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి వరకు కూడా సిగ్నల్స్ రాకపోవడంతో అసహనానికి గురయ్యారు. త్వరగా మరమ్మతులు చేసి సేవలను పునరుద్ధరించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వినియోగదారులు వాపోయారు.

### సీతారాం ఏచూరికి నివాళి

వెంకటాపురం(ఎం): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపై సీపీఎం నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అలువాల అయిలయ్య, రెడ్డి రామస్వామి, పసుల కోటయ్య, ఎనబోతుల సాంబయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ మండల కన్వీనర్‌గా సతీశ్

గోవిందరావుపేట: భారతీయ జనతా పార్టీ మండల కన్వీనర్‌గా మార్క సతీశ్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం తెలిపారు. ఈ మేరకు శనివారం సతీశ్‌కు నియమకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు పాటు పడాలని సూచించారు. కన్వీనర్ సతీశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా ముకుందరెడ్డి

ములుగు రూరల్ : పీఆర్‌టీయూ ములుగు మండల అధ్యక్షుడిగా సానికొమ్ము ముకుందరెడ్డిని ఎన్నుకున్నారు. ఈ మేరకు శనివారం పీఆర్టీయూ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గొరిశెట్టి శివప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడిగా రమేష్, ఉపాధ్యక్షులుగా పూర్ణచందర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా పద్మజ, మహిళా కార్యదర్శిగా గుగులోత్ రజిత, కార్యదర్శిగా తిరుపతిరెడ్డిలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ. వెంకటేశ్వరెడ్డి, కాసర్ల రమేశ్, యాకూబ్‌రెడ్డి, పిట్టల మల్లయ్య, ఎన్నికల అధికారి రాజయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.

### ఆటోయూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ ఆటో యూనియన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీడీ రాజు, ఉపాధ్యక్షుడిగా గజ్జల రాజశేఖర్, కార్యదర్శిగా నల్లమొక్క శ్రీను, ప్రధాన కార్యదర్శిగా గజ్జల సంపత్, కోశాధికారిగా కర్నాలా నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కడారి మహేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# గణపతి మండపాల వద్ద అన్నదానం



మొగుళ్లపల్లి: రాలచెట్టు వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



అన్నదానం కార్యక్రమంలో అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు మొట్లపల్లి గ్రామంలో శనివారం అన్నదాన కార్యక్రమం, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని సదాశివాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద బమ్మ వెంకటస్వామి దంపతులు మహాన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కట్ల కోటి, కట్ల నాగరాజు, సుదర్శన్, సునీల్ , ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చిట్యాలలో..



రేగొండ : కొత్తపల్లిగోరి సదాశివాలయంలో..



చిట్యాలలో..

చిట్యాల: మండల కేంద్రంలోని పోచమ్మతల్లి వద్ద, గిద్దెముత్తారం, లంబాడితండా గ్రామాల్లో గణపతి నవరాత్రుల సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు పరామర్శ



ప్రవళిక చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మధు



మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల: మండలంలోని గుంటురుపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెల్ది నాగేశ్వర్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబ సభ్యులను శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతుడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి సత్యం, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, టేకుమట్ల మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మండల నాయకులు కామిడి రత్నాకర్‌రెడ్డి, చిలుకల రాయకొంరు, దొడ్డి కిష్టయ్య, దబ్బెట అనిల్, పువ్వాటి వెంకన్న , గ్రామస్తులు ఉన్నారు.

కాటారం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురి కుటుంబాలను శనివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. కొత్తపల్లిలో ఇటీవల మృతి చెందిన బోగిరి ప్రవళిక, కోట రాజయ్య, నస్తూర్‌పల్లిలో మృతి చెందిన వెంకటయ్య, శంకరాంపల్లిలో వైష్ణవి కుటుంబాలను పుట్ట మధు ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే కొత్తపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న పాగె మల్లయ్య, శంకరాంపల్లిలో పోత శ్రావణ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఊర వెంకటేశ్వరరావు, నాయకులు గాలి సడువలి, ఉప్పు సంతోష్, కొండపర్తి రవి, కొండ తిరుపతి, లింగయ్య, జక్కు శ్రావణ్, మాజీ సర్పంచ్ నిట్టూరి శేఖర్, మహేశ్ తదితరులు ఉన్నారు.

# సభ్యత్వ నమోదు పెద్దఎత్తున చేపట్టాలి

● బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

కాటారం: గ్రామగ్రామాన పార్టీని బలోపేతం చేసేలా సభ్యత్వ నమోదు పెద్ద ఎత్తున చేపట్టాలని బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీని పటిష్టం చేసేలా సభ్యత్వాలు చేపట్టాలని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. కాటారం సబ్ డివిజన్‌లో సభ్యత్వాలు అధిక సంఖ్యలో చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు మంథని నియోజకవర్గ కన్వీనర్ మల్క మోహన్ రావు, పెద్దపల్లి జిల్లా కన్వీనర్ క్యాతం వెంకటరమణ, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూసాల రాజేంద్రప్రసాద్, ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ దుర్గం తిరుపతి, నాయకులు మచ్చగిరి రాము, ఆయా మండలాల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# న్యాయం చేయండి

భూపాలపల్లి రూరల్: తన భూమిని అక్రమంగా లాక్కోవాలని చూస్తున్న అక్రమార్కుడి నుంచి తన రెండెకరాల భూమిని కాపాడి తనకు చెందేలా చూడాలని మండలంలోని కొంపెల్లి తండాకు చెందిన గుగులోత్ వాలునాయక్ వేడుకున్నాడు. శనివారం జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు వాలునాయక్ వివరాలు వెల్లడించారు. మండలంలోని కొంపల్లి పరిధిలో 75/1 ఎసర్వే నెంబర్లలో తన తండ్రి నార్యనాయక్ 1984లో కొనుగోలు చేసి వ్యవసాయం చేశాడన్నారు. 2007లో మా నాన్న మృతి చెందగా మా అన్నదమ్ముల మధ్య తగాదాల వల్ల భూమి వద్దకు తాము వెళ్లలేదన్నారు. 2017 నుంచి తాను ఆ భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నామని, ఈ క్రమంలో పుల్లూరి రామయ్యపల్లికి చెందిన భద్రునాయక్ ఈ భూమిని మీనాన్న నార్యనాయక్ తనకు అమ్మినట్లు పత్రాలు తీసుకొచ్చాడన్నారు. అందులో 1 ఎకరం మాత్రమే మా భద్రునాయక్‌కు అమ్మినట్టు ఉందని తెలిపారు. కానీ రెండెకరాల భూమి మొత్తం నాదేనని నన్ను బెదిరింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేసుకుందామని పిలిచినప్పటికీ రాకుండా, భూమిలో కంది పంట వేసుకోగా పంటను మొత్తం తీసి నాశనం చేశాడన్నారు. సుమారుగా సాగుకు రూ. 1.60 లక్షలు పెట్టుబడి నష్టం జరిగిందన్నారు. అధికారులు మొదటి నుంచి లింక్ డాక్యుమెంట్లు పరిశీలించి అక్రమానికి పాల్పడుతున్న భద్రునాయక్ నుంచి తన భూమిని కాపాడి నాకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

# ఘనంగా అయ్యప్పస్వామి ఓనం పండుగ



అయ్యప్పస్వామికి చక్రస్నానం చేయిస్తున్న భక్తులు

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని శ్రీ హరిహర క్షేత్రంలో అయ్యప్పస్వామి ఓనం పండుగను ఆలయ ట్రస్ట్ చైర్మన్ ఆధ్వర్యంలో ఓనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం అయ్యప్పస్వామి పుట్టినరోజు సందర్భంగా స్వామి వారిని ఊరేగింపు నిర్వహించి స్వామి వారికి చక్రస్నానం (జలాభిషేకం) చేయించారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి అభిషేకం, పడి పూజ కార్యక్రమం చైర్మన్ పీఎంకే గాంధీ చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సత్యనారాయణ, శోభన్, శివాజీ, రామకృష్ణ, జోగా, రాజు, సదానందం, శివ, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# తాడిచర్లలో స్వచ్ఛత పక్షోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, కార్మికులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ ఆవరణలో స్వచ్ఛత పక్షోత్సవాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జెన్‌కో కోల్ కంట్రోలర్ అధికారి సుబ్రహ్మణ్యం, ఏజెంట్, బాలరాజు, జనరల్ మేనేజర్ మోహన్‌రావుల సూచనలతో, ఏఎమ్మార్ మైన్స్ అధికారులు ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్‌రెడ్డి, కేఎస్ఎన్ మూర్తి, శ్రీనివాస్, సురేష్ బాబు, విశ్వప్రసాద్, రవికుమార్, సూపర్ వైజర్లు కార్మికులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 14 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతకు సంబంధించిన వివిధ కార్యక్రమాలను 15 రోజులలో పాటు జరుపుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మైన్స్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

# లైంగికదాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

వెంకటాపురం(కె): ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలంలో ఆదివాసీ మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కోర్సా నర్సింహమూర్తి మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గూడెల్లో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మహిళపై దాడి జరిగిన వారం రోజుల తర్వాత జైనూరులో ఘర్షణ జరిగితే ప్రభుత్వం అమాయక ఆదివాసీలపై కేసు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ మహిళకు జరిగిన అన్యాయానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు మానవహారం చేపట్టారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోడెం నాగరాజు, మడకం రవి, రాజేష్, మహేశ్,, ఎట్టి ఝాన్సీ, నారాయణమ్మ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: పేద, నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని, సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి, టేకుమట్ల, రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన మొత్తం 60 మంది సీఎంఆర్‌ఎఫ్ లబ్ధిదారులకు రూ.18,98,500 విలువ కలిగిన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. మానవతాదృక్పథంతో సీఎం రేవంత్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఆర్థికసాయాన్ని మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో గణపతికి పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని వడ్డించారు. సాయంత్రం పట్టణంలోని గణపతి మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా కమిటీల సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, నాయకులు బుర్ర కొమురయ్య, తదితరులు ఉన్నారు.

## సూచిక బోర్డుల ఏర్పాటు



బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్

కాటారం: మండల కేంద్రంలోని యూత్ ట్రెనింగ్ సెంటర్(వైటీసీ) భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ కలెక్టర్ కార్యాలయానికి దారి చూపే సూచిక బోర్డులను శనివారం జీపీ అధికారులు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడలికి కొంత దూరంలో స్థానిక గిరిజన సంక్షేమ కళాశాల సమీపంలో కార్యాలయం ఉండటంతో వెళ్లడానికి సరైన దారి తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్పందించిన గ్రామపంచాయితీ కార్యదర్శి షగీర్ ఖాన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రధాన రహదారిపై, కార్యాలయం సమీపంలో రెండు సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. కార్యాలయం దారి తెలిపే బోర్డులు ఏర్పాటు చేయడంపై పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యానికేతన్‌లో మాక్ పోలింగ్



పోలింగ్ బ్యాలెట్ బాక్సులతో విద్యార్థులు



ఓటు వేస్తున్న చిన్నారి

కాటారం: మండల కేంద్రంలోని విద్యానికేతన్ పాఠశాలలో శనివారం నిర్వహించిన మాక్ పోలింగ్ పలువురిని ఆకట్టుకుంది. పోలింగ్ నమూనా, ఎన్నికలు, ప్రజాస్వామ్యంలో ఓటింగ్ విధానం తదితర అంశాలపై కరస్పాండెంట్ బుర్ర వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్నికల విధివిధానాలు, అనుసరించాల్సిన నిబంధనలను గూర్చి వివరించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధిక ఓట్లు వచ్చిన విద్యార్థిని స్కూల్ లీడర్‌గా గెలుపొందినట్లుగా ప్రకటించి ధృవీకరణపత్రం అందజేశారు. విద్యార్థులు పోలీసులుగా, ఎన్నికల సిబ్బందిగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులంతా విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు పూర్తి చేయాలి



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు, యువకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రం నుంచి ఎదిర వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి పనులు పూర్తి చేయాలని కోరుతూ కేంద్రంలోని శివాలయం గుడి సెంటర్‌లో ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారి పై బైఠాయించి గ్రామస్తులు, యువకులు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. రోడ్డు పనులు ప్రారంభించి ఏడాది కాలం గడుస్తున్నా కాంట్రాక్టర్ నేటి వరకు రోడ్డు పనులు పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై మెటల్ పోసి వదిలిపెట్టడంతో వాహనాల రాకపోకతో దుమ్ము విపరీతంగా వస్తోందని, దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పనులు పూర్తి అయ్యే వరకైనా కాంట్రాక్టర్ రోడ్డును ట్యాంకర్‌తో తడిపించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్యాడి క్లీనర్ మిషన్లపై పట్టింపేది ?



కొనుగోలు సెంటర్ వద్ద వృథాగా ఉన్న ప్యాడి క్లీనర్ మిషన్

చిట్యాల : మండలంలోని నైన్‌పాక కొనుగోలు సెంటర్ వద్ద ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్న రెండు ప్యాడి క్లీనర్ మిషన్లను సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపానలేదు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు సెంటర్‌కు తీసుకొస్తే అక్కడ ఉన్న ప్యాడిక్లీనర్ మిషన్‌లో పోసి తద్వారా ఎంతశాతం ఉందో చూసి మిల్లుకు తరలిస్తుంటారు. గత ఎండాకాలంలో కొనుగోలు సెంటర్లలో ఏర్పాటు చేసిన మిషన్లు ఇప్పటి వరకు వాటిని తీయకపోవడంతో అవి ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. దీంతో అవి తుప్పు పట్టిపోయే ప్రమాదం నెలకొంది. వాటిని త్వరితగతిన తీసి గదిలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# జ్వరాలపై ఇంటింటి సర్వే

వాజేడు : జ్వరాల తీవ్రతపై మండలంలోని ప్రగళ్లపల్లి, మొరుమూరు గ్రామాల్లో ప్రగళ్లపల్లి పల్లె దవఖాన వైద్యాధికారిణి గ్యానస వైద్య సిబ్బందితో శనివారం వెళ్లి ఇంటింటి సర్వే చేశారు. వైద్యశిబిరం నిర్వహించి 42 మంది రోగులను పరీక్షించి వారికి మందులను పంపిణీ చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. గర్భిణులతో పాటు బాలింతలు, మధుమేహ వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. ఈ సందర్భంగా రోగులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించడంతో పాటు ఇళ్లల్లో ప్లాస్టిక్ పరికరాలతో పాటి ఇతర పాత్రల్లో నిల్వ నీటిని ఉంచొద్దన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు వెంకటరమణ, కోటిరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, ఏఎస్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాలు**

వెంకటాపురం(కె): మండలంలోని నూగూరు, వీరభద్రవరం, చొక్కాల, నూగూరు గ్రామాల్లో శని వారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సాక్షి స్పందన



సాక్షి
ఇసుక అక్రమ రవాణాకు అడ్డేలేదా..?

సాక్షిలో ప్రచురితమైన కథనం

టేకుమట్ల: 'ఇసుక అక్రమ రవాణాకు అడ్డే లేదా..?'అనే కథనం సాక్షిలో శనివారం ప్రచురితం కాగా స్పందించిన పోలీసులు మండలంలోని రాఘవరెడ్డిపేట శివారు చలివాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, అక్రమ ఇసుక రవాణాను నివారిస్తామని ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు.